# తాజ్ మహల్

ఈ యువకుడు బలవంతాన చావడానికి నిర్ధారించుకున్నాడు. కారణం ఒకటి కావచ్చు. చాలా కారణాలుండవచ్చు. అతనే చెప్పే బదులు లోకానికే వూహించడానికి వదలాలని నిశ్చయించుకున్నాడు.

ఇంతవరకు బొమ్మల్లో తాజ్‌ని చూసాడు. ఈ మహల్‌ని చూసిన కవులు, చూడని కవులూ రాసిన కవిత్వం చదివాడు. తాజ్ చరిత్ర, ఆ చరిత్రను ఆధారంగా చేసుకుని రాసిన కథలూ వల్లించాడు. పదుగురాడుమాటగా, దీని అందచందాల కీర్తి వెలిగిపోతుందనీ – పదుగురూ అందమైనదన్న మహల్ ఒడిలో చచ్చిపోతే లోకమంతా తన గురించి ఆలోచిస్తుందనీ... అందుకే తాజ్ నాలుగు స్తంభాలలో ఒకదాని పైకెక్కి కిందికి గెంతాలని బయలుదేరాడు.

ఈ యువకుడు అందరిలా సుఖపడుతూ కీర్తికోసం ప్రాకులాడలేదు. నిండు ప్రాణాన్ని బలిచేస్తూ కీర్తిని కాంక్షిస్తున్నాడు. ఈ తాజ్ సృష్టి సుఖపడుతూ కీర్తికోసం ప్రాకులాడిన చక్రవర్తిదా లేక ప్రాణాన్ని బలిచేస్తూ కీర్తిని కాంక్షించిన ముమ్‌తాజ్‌దా?

ముమ్‌తాజ్‌పైనున్న అమర ప్రేమవలన యీ మహల్‌ని మహారాజు సృష్టించాడట! ఈ యువకుడు నవ్వుకున్నాడు. ఈ చక్రవర్తి మనిషి. తోటి ప్రాణి మీద కాసింతైనా కనికరం చూపించాడా? ఈ సాటిలేని అందాలరాసిని ఒక పశువులా ఉపయోగించుకున్నాడు! ఆ రోజుల్లో స్త్రీకి ప్రతి ఒక్క కాన్పు పునర్జన్మ. పద్దెనిమిదేళ్ళలో ఐదు కాదు, పది కాదు, పోనీ పదమూడు కాదు, పధ్నాలుగు సంతానాలు. ఈ చివరి పురిటిలో ఆమె కన్ను మూసింది. ఆమె చనిపోయాకే చక్రవర్తి కన్ను తెరచాడు. ఆలోచనలలో మునిగాడు. అప్పుడే మనిషయ్యాడు. తన ప్రవర్తన గుర్తుకు వచ్చింది. ఆమెకు చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం – ఆమె కోరిన కోర్కె తీర్చటమేకాదు, ఆ చక్రవర్తి యెంత బాధ పడ్డాడంటే – తానో ఖూనీకోరు ననుకొని వుంటాడు. తను నేరస్థుడని నిర్ధారించుకుని వుంటాడు. అందుకే... ఆమె ప్రక్కనే తన సమాధి వుండాలని యేనాడూ కోరుకుని వుండలేదు. యమునానదికి అవలి ఒడ్డున యింకో మహల్... నల్లని పాలరాతితో నిర్మించిన మహల్లో, మధ్య యమునానదీ ప్రవాహం అడ్డుగా వుండగా... తన సమాధి విడిగా వుండాలని కోరుకున్నాడు. ప్రియమైన తెలుపురంగు కాదని అప్రియమైన నలుపురంగు

నెంచుకున్నాడు. ప్రియమైన ప్రేయసి చెంత నుండక ఒంటరిగా వుండాలనుకున్నాడు.

ఇలా అనుకున్న యువకుడు చప్పున తన గుండె తడుముకున్నాడు. తనూ నేరం చేస్తున్నట్లు యేదో అనుమానం. తనెందుకు బలవంతాన చావబోతున్నట్లు?

చక్రవర్తి నిజంగా ఆమెనే ప్రేమించి వుంటే ప్రాణత్యాగం ఎందుకు చేసుకోలేదు? బహుశః ఆమె చివరి కోరికకు ఒక రూపు నివ్వాలనా? ఒకరి కోరిక తీర్చబోతూ మనిషి తన కోరికనూ పెంచుకుంటుంటాడు. చక్రవర్తికి అలాంటి కోరికేదైనా వుండేదా? ఉంటే అదేది? బహుశః ఆ కోరిక బ్రతుకుమీద ఆశలను సృష్టించగలిగేదేయై వుండాలి. అదే తనకు తెలిస్తే తనీ ఆత్మహత్యాప్రయత్నం మానగలడేమో? అదేదో తాజ్ దగ్గర తనకు తట్టకూడదా?

ఒక మనిషి కోరిక యింకో మనిషిని పిండకుండా తీరదు. కోరిక పెద్దదైనకొద్దీ పిండబడిన మనుషుల సంఖ్య పెరుగుతుంటుంది. ఆ రోజుల్లో యీ మహల్ నిర్మించడానికి మూడు కోట్లపైనే ఖర్చయిందట. ఇంచుమించు యిరవై వేల మనుషులు యిరవై రెండేళ్ళు రాత్రింబవళ్ళు పనిచేశారట. ఈ యిసిక పునాదులు తవ్వుతూ యెన్ని ప్రాణాలందులో కప్పబడ్డాయో? రాళ్ళను యెత్తేటప్పుడు యెందరి కాళ్ళు చేతులు తెగాయో? ఇక్కడ కొటికే చలికి సరైన గుడ్డలు లేక యెందరు చచ్చారో? మండుటెండలకు మూతి తడపడానికి నీరు లేక యెందరు సొమ్మసిల్లారో? ఎందరికి కరకు కొరడా దెబ్బలు తగిలాయో? ఎందరు నీరసంతో కుంగి కుశించిపోయారో? ఈ డబ్బుకోసం చక్రవర్తి యెందరి తలలపై పన్నులు రుద్దాడో? ఎన్నిచోట్ల క్షామం వీరవిహారంచేసి యెందరిని తన ఆకలి పొట్టలో జీర్ణింపజేసుకుందో? ఇవన్నీ యెవరూ యెక్కడా రాయలేదు. రాసిందల్లా రాజుగారి ప్రేమ ఫలం గురించే! రాజుగారు రోజా ఆ స్థలానికి వచ్చేవారు. ప్రతి ఒక్క పాలరాయినీ, ఆ పైని నగిషీలనూ పరీక్షించే వుంటారు. వాటితోపాటు ఆ కళ్ల సందుల్లోంచి యీ బాధలు కూడా కనిపించే వుంటాయి.

తాజ్మహల్ పూర్తయ్యాక తన ప్రేయసి చెంత నిత్యం వుండగలిగేవాడు. కానీ వుండలేదు. తను అల్లంతదూరంలో ఆగ్రా కోటనించి ఒక కిటికీకి అమర్చిన పాలరాతి పూలతీవ నందునించి చూసేవాడు. అతనికి బహుశః యీ అందమైన మహల్ కనిపించకపోయి వుండవచ్చు. తనకు కనిపించేది – నడుస్తూ, కూలిపోయే మానవ సమూహం, చలికీ యెండకూ సతమతమయ్యే కూలిజనం, కాళ్ళూ చేతులూ విరగ్గొట్టుకున్న శిల్పులు, కొరడా దెబ్బలు తింటున్న బక్కచిక్కిన మనుషులు – వీళ్ళ ఆర్తనాదాలు! తన కొడుకు బందిఖానాలో వెయ్యించాడని చక్రవర్తి క్లేశపడలేదు. ఈ యిరవైరెండేళ్ళూ యిరవైవేల మానవ సమూహానికి తనవలన కలిగిన బాధలూ, కష్టాలూ, నష్టాలూ – మనఃక్లేశాన్ని కలిగించి వుంటాయి.

అంతకముందు చక్రవర్తికి తెలుపంటే యిష్టం. లతలూ, లలితకళలంటే మరీ యిష్టం. పానీయం, వెన్నెల వెలుగు, వలపుతేనె ప్రసాదించిన వుత్తేజంతో బ్రతికాడు. ఆ భావస్ఫూర్తితోనే నెమలి సింహాసనంలాంటి కళాఖండాలు నిర్మింపజేశాడు. తాజమహల్ నిర్మించే రోజుల్లో యీ వెలుగులోనికి విచారం చొచ్చుకుంది గానీ, వెలుగు ఆరి చీకటి కాలేదు. ఇది పూర్తయాక మనఃక్లేశంతో చూసిన చక్రవర్తికి అంతా

చీకటిగానే కనిపించి వుంటుంది. ఇన్నాళ్ళూ తన యిష్టాయిష్టాలకు అధికారాన్ని కొరడాచేసి లోకులపై రుద్దాడు. ఎందుకు? తన సుఖం కోసం. సుఖం కోసం ప్రాకులాటే ఒక సుఖం. కీర్తికి ప్రాకులాట కూడా సుఖంకోసం ప్రాకులాటలాంటిదే. చక్రవర్తికి యీ చివరి రోజుల్లో గతం అంతా ప్రతిరోజూ ఒక మరుగుజ్జులా యెదటపడి విసిగెత్తించి వుంటుంది. గతంలో చేసిన ప్రతి పనీ ఒక ప్రశ్నగా మారి చిరాకెత్తించి వుంటుంది. లేనిపోని అనుమానాలకు తావిచ్చివుంటుంది. వాటిని సవాలుచేసే స్తోమత చక్రవర్తికి లేకపోయి వుంటుంది. సుఖంకోసం జీవితకాలం ప్రాకులాడి సుఖపడాలనే బంధిఖానాలో చచ్చిపోయి వుంటాడు.

ఈ యువకుడు అల్లి బిల్లిగా గజిబిజిగా యిలా యెన్నెన్నో ఆలోచించుకుని చివరకు షహజహాన్ చక్రవర్తికి వుండిన అన్ని లోటుపాట్లు తనలోనూ వున్నాయనుకున్నాడు. తనూ చక్రవర్తితో సముడే అనుకున్నాడు. అయితే యీ లోటుపాట్లుతో తనెందుకు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు? చక్రవర్తి ఆత్మహత్య చేసుకోలేదు.......

ఈ ప్రశ్నకు జవాబు తను ఒక గెంతు గెంతి చచ్చేలోగా ఆ తాజ్ దగ్గరే తట్టవచ్చుననుకున్నాడు. జేబులో కాగితం తీసి ఒకసారి మళ్లీ చదువుకున్నాడు – 'ఎందుకు ఆత్మహత్య చేసుకున్నానో వూహించుకోండి చూద్దాం!'

'ఓహోహో ..... ఎందరు పేపర్లలో యెన్ని భాషల్లో చదువుతారో, చదివే వాళ్ళలో ఆడా మొగా, యువకులూ యువతులూ, పెళ్ళయినవారూ పెళ్లికానివారూ – ఎందరెందరి మనసుల్లో నా ప్రశ్న మెసలుతుందో? ఏదో మారుమూల ఛస్తే యీ అదృష్టం కలుగుతుందా?' అనుకున్నాడు.

తాజమహల్ ప్రాంగణంలోనికి చేరేసరికి సాయంత్రం నాలుగైంది. ఆ యెర్రని ముందు దర్వాజా దాటి ఒక అడుగు వేసాడు. సాయంత్రపు యెండ చలువరాతి మహల్‌లో చొచ్చి చల్లబడి వెన్నెల్లా ప్రకాశిస్తోంది. తొలిసారి యీ మహల్‌ని చూసిన యీ యువకుడు ఆ ద్వారం ప్రక్కనే లోన కూర్చుండిపోయాడు. భూమి మీద నిల్చున్న నిండు జాబిల్లా వుంది. యువకునికి నోట మాట రాలేదు. తనెవరు, యెందుకొచ్చిందీ గుర్తుకు రాలేదు. గిల్లుకున్నాడు. తాజ్ వెలుగుతున్న వేదంలా అగుపించింది. నిత్యం నిల్చుండిపోయిన చీకటి రాత్రిలో నిరాఘాటంగా వెలిగే మెరుపులా వుంది. ఇక్కడ చచ్చిపోతే స్వర్గంలో చావులాంటిదే........

అలా చూస్తూనే కాలు కదిపాడు. గైడ్ చరిత్ర చెప్పుకుపోతున్నాడు. ఆ స్తంభాలు యెక్కవచ్చా అని ప్రశ్నించాడు. 'ఆత్మహత్యలు ఆపడానికని వాటికి తాళాలు వేయబడ్డాయి.'

ముందుకు కదిలాడు. పూలతోట మధ్యలో నున్న నీటికుండీ దగ్గర పాలరాతి బెంచీ మీద కూర్చున్నాడు. తను ప్రేమించిన ప్రియురాలి ఆనాటి రెండు కళ్లూ కలుపుకొని నాలుగు కళ్ళతో చూసినా తనివి తీరటంలేదు. ఈ పాలరాయి మామ్మూలు పాలరాయికాదు. ఈ చెక్కడాలు కరిగిపోయే కండరాల పనితనంకాదు. ఇది మూడు లోకాల దీపం. సుందరదీపం. రెక్కలు కట్టుకుని యెగిరే మానవుల వూహలతో, పన్నెండు వెన్నెలలు ఛాయలతో, పది అవతారాలెత్తిన దేవుని దీవనలతో వెలసిన ప్రేమ చిహ్నం.

పచ్చగడ్డి పరదాలపైకి దిగాడు. చుట్టూ రంగురంగుపూలాలతో నిండిన మొక్కలు. ఆ రంగులన్నీ తాజ్ వెలుగులో తెలుపెక్కుతున్నాయ్. గడ్డిమీద దొరిదొర్లి చూసాడు. నీలమూతులతో నిల్చున్న తెల్లపావురాల సమూహంలా కనిపించింది. ఒకోసారి ఒకో రూపుతో కనిపిస్తోంది.

జోళ్లువిడిచి మెల్లెక్కాడు. అంతా పాలుపొంగుతున్న రాయి. అడుగులతో కలుషితంచెయ్య మనసువుట్టడంలేదు. నడుస్తుంటే గాలిలో పాదాలు తేలిపోతున్నాయ్. తలెత్తితే దించ బుద్ధి పుట్టడంలేదు. ఒక మబ్బు, ఒక మెరుపులేని నీలాకాశం, కన్ను మూసి క్రిందకు గెంతడానికి ప్రయత్నిస్తోంది. తాజ్ ఒక్కొక్క కోణంనించి చూస్తుంటే ఒక్కొక్కరూపు. తాజ్‌మహల్ ఒక కట్టడంకాదు – ఎన్నో కట్టడాలు. ఒక గేయంకాదు – ఒక గేయ సంపుటి. ఒక రాగం కాదు. రాగమాలిక. గారాబు యువతులు లతలై నిత్యయౌవనంతో తాజ్ అంతా అల్లుకుని వున్నారు.

క్రిందకు దిగితే, గోరిలలో ప్రణయజంట. మేల్కొనడానికి సిద్ధంగా వున్నట్లు.......ఆ వాసన.......

చల్లని గాలి. కానీ యువకుడు యింకా చల్లబడలేదు. ఇంకా మనిషి కాలేదు. ఇంకా ఆలోచించలేదు. కలలో స్వర్గాన్ని చూస్తున్నట్లే వున్నాడు. ఒక్కసారి యమున ఒడ్డువేపు వెళ్ళేసరికి ఒళ్లు ఝల్లుమంది. ఆ కేకలతో తెలివి తెచ్చుకున్నాడు. తను యెందుకు వచ్చిందీ గుర్తుకు వచ్చింది. ఇక్కడ చచ్చిపోకపోతే యింకెక్కడ చావగలడు? ఎక్కడనించి గెంతాలి? ఇక్కడనించి యమునలోనికి గెంతితే తను చావడు. ఆ యిసికపైపడితే యే కాలో చెయ్యో విరుగుతుంది. అంతే. ఇలా యీ తలుపులు మూస్తారని తెలిసివుంటే మారుతాళమైనా మాయతాళమైనా తెచ్చేవాడు. ఎక్కడనించి గెంతినా తాజ్ పాలరాయిపై పడి ముద్దాడి చావాలి – తప్పక చావాలి......

చక్రవర్తి యెందుకు బలవంతాన చావలేదూ? ఇదేదీ చరిత్ర కాదంటాడెవడో? ఈ క్రింది యమునానది యిసుకపై కూర్చొని అరుస్తున్నాడు. వాడు పిచ్చివాడు కాదుకదా? ఆ గైడు చెప్పింది అసలైన చరిత్రకాదంటాడు. తనొక్కడికే అసలైన చరిత్ర తెలుసునంటాడు. అక్కడ మూగినవాళ్లలో యే ఒక్కడైనా ఒక అర్ధరూపాయి యివ్వగలిగితే అసలుగుట్టు చెప్తానంటాడు. చివరకు 'ఇస్తాను, చెప్పు' అని ఒకడు యీ పైనించే అరిచాడు. కూర్చున్నవాడు లేచి నది ఒడ్డునే నిల్చున్నాడు. చెవిదగ్గర చెయ్యిపెట్టి గట్టిగా అరుస్తున్నాడు.

'అయ్యల్లారా; అమ్మల్లారా! ఈ అసలైన తాజ్ చరిత్ర వినండి. ఈ మహల్ నిర్మించిన శిల్పుల సంతతిలోనివాడిని. మా తరతరాలకు తెలిసిన సత్యమిది. షహజహాన్ చక్రవర్తి. కానీ మనిషే. మనుషులరోగాలు వాళ్ల మమకారాలకు దెబ్బతగిలినప్పుడే బయటపడ్తాయ్. భార్య పోయాకే చక్రవర్తి తన రోగాలేవో తెలుసుకున్నాడు. ఆమె చావు అతనికొక సవాలు. అతను ఒంటరిగా వుండలేదు. ఆమెతో కలిసివుండాలి. ఆమె అప్పటికే యీ దేహం చాలించి దైవాత్మరూపం దాల్చింది. మనిషిగా అతనా ఆత్మ దరి చేరలేదు. రోజు రాజ్యాంగంలో అసత్యానికీ, అధర్మానికీ, రక్తపాతానికీ అన్నిటికీ దూరమయ్యాడు. అప్పుడే అతని ఆత్మ మేల్కొంది. అని భార్య దైవాత్మసాటిగా మెసలిందతని ఆత్మ. అప్పుడే ఈ 'దివ్యమణి తాజ్'ని వూహించగలిగాడు. అతని కంటికి అప్పుడు రక్తమాంసాలతో

నున్న ముమ్‌తాజ్ కనిపించలేదు. ఆమె బ్రతికి నన్నాళ్లూ కూడగట్టుకున్న మంచి, మాణిక్యమై దివ్యలోకంలో మెరుస్తుండటం చూసాడు; ఆ మణే యిది - ఈ తాజ్‌మహల్!

'అయ్యా! ప్రేమించిన యిల్లాలు చచ్చిపోతే ఆత్మహత్య యెందుకు చేసుకోలేదు? కష్టకాలంలో మనిషి దెయ్యంగా మారగలడు; దైవంగా మారగలడు. అతడు దైవమవటానికే ప్రయత్నించాడు.

'యమున ఒడ్డులో మనిషి చక్రవర్తిలా నిల్చున్నాడు. ఈ మహల్ పూర్తయినరోజున ఆ యిరవై వేల మందిని యిక్కడచేర్చి యేమన్నాడో తెలుసా? చక్రవర్తి మాటాడినట్లే మాటాడుతున్నాను.

'మీ అందరికీ నా అభినందనలు. ఈ మాణిక్యం మలుస్తూ మరణించిన వాళ్లందరికీ నా వందనాలు.

'ఏ మానవ హస్తం ఈ మహల్‌ని నాశనం చెయ్యలేదు. ఎందుకంటారా?

'ఇది మీ దివ్యమైన చేతులతో మలచబడింది. స్నేహితులారా!

'ఇక ఈ రోజునించి నేను మళ్లీ మనిషిగా మారతాను. ఎందుకంటారా?

'ఈ దేవతలు కట్టిన మహల్‌ని చూస్తూ మురిసిపోడానికి.'

ఈ కథ చెప్పిన చక్రవర్తి కూడా మనిషిగా మారి అర్ధరూపాయి యేదని అరుస్తున్నాడు. వాడు చెప్పకుండానే చిరునగవుతో వీడో పిచ్చివాడనుకుని కదిలిపోయాడు. క్రిందవానితిట్లు హెచ్చయినకొద్దీ మర్యాదస్తులంతా ఒక్కొక్కరూ కదిలిపోయారు. ఈ యువకుడు వాళ్లంతా కదిలాక జేబు తడుముకున్నాడు. ఉన్న చిల్లరంతా 'అందుకో' అని అరుస్తూ విసిరాడు.

క్రిందివాడు చిల్లర యేరుకుని 'నాకు యింత యెందుకు? అర్ధరూపాయి చాలు' అన్నాడు.

'అవును, అర్ధరూపాయి నువ్వు చెప్పిన అసలైన చరిత్రకు.'

'మిగతా దేనికి?'

'నా ప్రాణం రక్షించినందుకు!'

'ఎలా?'

'చక్రవర్తి దైవాత్మనించి మనిషయ్యాడు. నేను దయ్యంనించి మనిషయ్యానిప్పుడు. మళ్లీ మళ్లీ వస్తాను. మళ్లీ మళ్లీ ఈ దివ్య భవనాన్ని చూస్తాను....నువ్వు చెప్పిన దివ్యమైన గాధను మళ్లీమళ్లీ నీ నోట వింటాను. ఎప్పుడో ఒకనాడు వీటిప్రభావం వల్ల నా మంచి మాణిక్యమై నేనూ దివ్యల్లో కలిసిపోతాను...'

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 20-8-1971)

* * *